పెచ్చుమీరుతున్న జూదం..

యథేచ్ఛగా కోడిపందేలు, పేకాట

- అధికార పార్టీ నాయకులే నిర్వాహకులు?
- చోద్యం చూస్తున్న పోలీసు అధికారులు
- పోలీస్‌స్టేషన్ ఎదుటే జూదరుల అడ్డా!
- తనిఖీలకు వెళ్తున్నారంటే క్షణాల్లో సమాచారం లీక్..


అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ఎదుట జూదరులు, నేతల అడ్డా

అశ్వారావుపేట: ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారాక తర్వాత అశ్వారావుపేట సర్కిల్ పరిధిలో అధికార పార్టీ నాయకుల అండదండలతో జూదక్రీడలు ఎక్కువయ్యాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎన్నికల ఫలితాల అనంతరం అశ్వారావుపేట, దమ్మపేట పోలీస్ స్టేషన్లలో నమోదైన కోడి పందాలు, పేకాట స్థావరాలపై కేసులనే ఇందుకు సాక్ష్యాలుగా చెబుతున్నారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి పంచాయతీల వారీగా అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్న వారు జూదాలు నిర్వహిస్తున్నారని సమాచారం. అయినా, పోలీసులు అడపాదడపా తప్ప పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు జూదం నిర్వహించే వారి అనుచరులు, అధికార పార్టీలోని కొందరు నాయకులు పోలీసుస్టేషన్ ఎదుటే అడ్డా వేసి పోలీసులు రైడింగ్‌కు బయలుదేరుతున్నారంటే వాహనం ఎటు వైపు వెళ్తుందో సమాచారం ఇస్తుండడంతో జూదరులు తమ సామగ్రితో మాయమైపోతున్నారని తెలుస్తోంది.

ఎక్కడెక్కడ..?

అశ్వారావుపేట మండలం సున్నంబట్టి, కొత్త మామిళ్లవారిగూడెం, ఆసుపాక ప్రాంతాల్లో బిర్రులు ఏర్పాటు చేసి మరీ పందాలు నిర్వహించగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నారంవారిగూడెం, మొద్దులగూడెం, తిరుమలకుంట సమీపంలోని బోగందాని గండి చెరువు ప్రాంతం, గుమ్మడవల్లి, కొండతోగు, జమ్మిగూడెం ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగానే నిర్వహిస్తున్నట్లు సమాచారం. అశ్వారావుపేటలోని లాడ్జిలు కొన్ని పేకాటకు అడ్డాలుగా మారిపోయాయని తెలుస్తోంది. ఆయిల్‌పాం తోటల్లోని గెస్ట్‌హౌస్‌లు పేకాట స్థావరాలుగా మారినట్లు సమాచారం. గతంలో కూడా జూదం నడిచినా ఎన్నికల అనంతరం విచ్చలవిడిగా పెరిగినట్లు తెలుస్తోంది. గాండ్లగూడెం తండా, చెన్నాపురం గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో ప్రతీ ఆదివారం కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పేరాయిగూడెం, అల్లిగూడెం గ్రామాల మధ్య ఆయిల్‌పాం తోటలు, అటవీ ప్రాంతంలో కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అశ్వారావుపేట, గుర్రాలచెరువు గ్రామాల్లోని కొన్ని ఆవాసాల్లో పట్టపగలే కోడి పందాలు అరగంట వ్యవధిలో పూర్తి చేసుకుంటున్నట్లు సమాచారం. దమ్మపేట మండలం పెద్దగొల్లగూడెం శివారు లంక ప్రాంతంలో పామాయిల్ తోట పేకాట, కోడిపందాలకు అడ్డాగా మారినట్లు సమాచారం. ఎస్సై సీరియస్‌గా స్పందించడంతో చాటుమాటుగా జూదాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది.

పోలీస్‌స్టేషన్ ఎదురుగానే అడ్డా..

పోలీస్ స్టేషన్ ఎదురుగా వాహనంపై ప్రయాణం చేయాలన్నా.. ఎవరైనా కొంత జంకుతారు. కానీ పేకాట, కోడిపందాలు ఆడేవారు, నిర్వహించే వారు నిత్యం పోలీస్‌స్టేషన్‌ను కనిపెట్టుకుని ఉంటారు. పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చే వాహనంలో ఏ అధికారి ఉన్నారు.. ఏ రూట్‌కు వాహనం వెళుతోంది సమాచారం సేకరించి జూద స్థావరాలకు చేరవేస్తుంటారని సమాచారం. అప్పటికీ పోలీసులు చాకచక్యంగా కొన్ని చోట్ల దాడులు నిర్వహించి వారిని పట్టుకుని కేసులు పెడుతున్నారు. కాకుంటే పట్టుబడే వారు ఈ బృందానికి చెందిన వారు కాదని తెలుస్తోంది. అధికార పార్టీ నాయకులు సైతం కొన్ని సందర్భాల్లో పట్టుబడిన జూదరులను వదిలేయాలని గతంలో పోలీసులపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం.


కోడిపందాల బిర్రు (ఫైల్)

నిఘా మరింత పెంచుతాం...



జూదాలను కట్టడి చేసేలా నిఘా పెంచుతాం. కోడిపందాలు, పేకాట వంటి వాటికి పాల్పడుతున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరి ఒత్తిడికి లోనయ్యే పరిస్థితులు ఉండవు. ఎవరికైనా సమాచారం ఉంటే నేరుగా తెలియజేయవచ్చు.

– జితేందర్ రెడ్డి, సీఐ అశ్వారావుపేట

క్లుప్తంగా

ప్రతిష్ఠాపన మహోత్సవం


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలో నిర్మించిన రామాలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో శ్రీ సీతా సమేత శ్రీరామచంద్రస్వామి విగ్రహ, ధ్వజస్తంభ, ముత్యాలమ్మ, నాభిశిల ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

23 నుంచి తిరునాళ్లు..

దమ్మపేట: మండలంలోని మొద్దులగూడెం గ్రామ శివారులో కొలువైయున్న శ్రీ ఏకులపోతమ్మతల్లి ఆలయంలో ఈ నెల 23 నుంచి తిరునాళ్ల మహోత్సవాలు నిర్వహించబడునని ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలను ఈ నెల 23 నుండి 25 వరకు, మూడు రోజుల పాటు కలశస్థాపన, అఖండ ప్రజ్వలన, సామూహిక కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని పేర్కొన్నారు.

వేలంపాటలు

దుమ్ముగూడెం: పర్ణశాల పంచాయతీలో ఈ నెల 22న వాహన పార్కింగ్, బోట్ షికారు, మరుగుదొడ్ల నిర్వహణకు బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు వేలం పాటలు ప్రారంభమవుతాయని ఆసక్తిగల గిరిజనులు ఈ వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

పశువుల సంత వేలం వాయిదా

చర్ల రూరల్: చర్ల పశువుల సంత వేలం పాటని నేటికి(గురువారం) వాయిదా వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం మార్కెట్ ఆవరణలో బుధవారం షాపింగ్ కాంప్లెక్స్, పశువుల సంత వేలం మొదటు పెట్టారు. ఈ మేరకు సాయంత్రం 6 వరకు కూడా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్ ఎన్నిక


వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన అల్లాడి వెంకటేశ్వరావును బుధవారం స్టీరింగ్ కమిటీ, గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత ఆలయ కమిటీ జాతరకు సంబంధించిన లెక్కలను ఈ నెల 5న జరిగిన సమావేశంలో లెక్కలు తెలియజేస్తానని చెప్పి సమయం తీసుకుని గ్రామస్తులు స్టీరింగ్ కమిటీ సమావేశంలో లెక్కలను సమర్పించడంలో విఫలమైంది. మరో మూడు రోజుల సమయం కావాలని కోరడంతో స్టీరింగ్ కమిటీ గ్రామస్తులు ఏకగ్రీవంగా పాత కమిటీని రద్దు చేస్తూ నూతన ఆలయ కమిటీ చైర్మన్‌ను ఎంపిక చేశారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు శిరపు వెంకటరమణారెడ్డి, కొత్తూరి సీతారామరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోమియో వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పూజ

చర్ల రూరల్: మండలంలోని క్రాంతిపురంలో బుధవారం హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. మలేరియా జ్వరాలతో బాధపడుతున్న వారికి హోమియోపతి డాక్టర్ పూజ వైద్యం అందించారు. గ్రామంలో రక్తనమూనాలను సేకరించి వారికి చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాంప్రసాద్, గోపి, సుశీల, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా ఎన్నికల నియమావళి

- ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి వేణుగోపాల్


అధికారులకు సూచనలు చేస్తున్న వేణుగోపాల్

అశ్వారావుపేట: ఎన్నికల నియమావళి సక్రమంగా అమలు చేయాలని ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి డి.వేణుగోపాల్ సూచించారు. బుధవారం ఆయన అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సెక్టార్ అధికారులు, ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, నిఘా బృంద సిబ్బందితో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అలసత్వం వహించకుండా పనిచేయాలని సూచించారు. మోడ్ ఆఫ్ కోడ్ కండక్ట్ ఉల్లంఘనలు జరుగకుండా సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, ర్యాంప్ సౌకర్యం కల్పించి నివేదిక సమర్పించాలని 32 మంది సెక్టార్ అధికారులకు సూచించారు. దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వారు ఇంటివద్దనే ఓటు హక్కు వినియోగించుకునేలా తహసీల్దార్‌లు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు వీ.కృష్ణప్రసాద్, సీహెచ్ నరేష్, డి.గదీశ్వర ప్రసాద్, సంధ్యారాణి, పుల్లారావు, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ, ఎంపీడీఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిఘా కేంద్రం పరిశీలన


నిఘా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

చర్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చర్లలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను బుధవారం భద్రాచలం ఆర్డీఓ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ దామోదర్ పరిశీలించారు. చర్ల పోలీస్ స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సందర్శించిన ఆయన స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శాసన సభ ఎన్నికల సందర్భంలో ఎదురైన పరిస్థితులపై ఆరా తీశారు. నిఘా కేంద్రంలో నమోదు చేస్తున్న అంశాలను ఆయన పరిశీలించి ఇక్కడి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కల్పించాల్సిన సౌకర్యాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ బి.భరణిబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, వరలక్ష్మి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రూనింగ్ పనులు చేపట్టాలి


మాట్లాడుతున్న కనకయ్య

ములకలపల్లి: తునికాకు ప్రూనింగ్ పనులు సత్వరమే చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల కార్యదర్శివర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. వేసవిలో పేదల ప్రధాన ఆదాయవనరైన తునికాకు సేకరణపట్ల పాలకపక్షాలు చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. ఆకు సేకరణకు వెంటనే టెండర్లు ఆహ్వానించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు మాలోతు రావూజా, ఊకంటి రవికుమార్, గొగ్గెల ఆదినారాయణ, పొడియం వెంకటేశ్వర్లు, నిమ్మల మధు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


గుండాల: సామూహిక అక్షరాభ్యాసం


అశ్వాపురం: తుమ్మలచెరువులో..

అశ్వాపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని, పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ బూర్గంపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ ప్రమీల అన్నారు. మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామంలోని రైతువేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయిలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఏసీడీపీఓ రేవతి, సూపర్‌వైజర్లు రాజేశ్వరి, సక్కుబాయి, కో ఆర్డినేటర్ శంకర్, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు స్థానికులు పాల్గొన్నారు.

గుండాల: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను బాలింతలు, గర్భిణులు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఆళ్లపల్లి మండలం బోడాయికుంట గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తినాలని, రెండు సంవత్సరాల పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠుపై ఇంటింటి సర్వే

మణుగూరు రూరల్ : జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్యసిబ్బంది ఇంటింటికి తిరుగుతూ లక్షణాలను ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకోవడంతో పాటు పలువురు అనుమానితులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఈ విజయకుమార్, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

జాతర ప్రారంభం

గుండాల: ఆళ్లపల్లి మండలం నడిమిగూడెం గ్రామానికి చెందిన పాయం వంశీయుల ఇలవేల్పు రణాసూరుడు జాతర బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. గ్రామ సమీపంలోని ఊరగుట్ట నుంచి దేవుడిని తీసుకవచ్చి గద్దెలపై ప్రతిష్టించడంతో ఈ జాతర ప్రారంభమైంది. నేడు(గురువారం) వనదేవతను తీసుకరావడంతో నిండుజాతర ప్రారంభమవుతుందని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయం బొర్రయ్య, పాపయ్య, సీతయ్య, బుచ్చయ్య, సత్యం, అంజిబాబు, కనకయ్య, పాపారావు, రాంనర్సయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


జాతరలో పాల్గొన్న పాయం వంశీయులు

శ్రమకు తగిన వేతనం చెల్లించాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: ఉపాధి హామీ కూలీలకు శ్రమకు తగిన వేతనం చెల్లించాలని సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. సారపాకకు సమీపంలోని పుష్కరవనం వద్ద ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను బుధవారం ఆయన కలసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రవాణా చార్జీలు పోను ఉపాధిహామీ కూలీలకు రోజుకు రూ.100 వేతనం కూడా దక్కడం లేదన్నారు. కూలీలకు కొలతల ప్రకారం కాకుండా రోజుకు రూ.600 వేతనం చెల్లించి, ఏడాదికి 200 రోజులు పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసమ్మ, స్వర్ణ, సుధామణి, పద్మ, శైలజ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలి


మాట్లాడుతున్న సుధాకర్

మణుగూరు రూరల్: సింగరేణి సంస్థలో ఉద్యోగ అవకాశాల కోసం నిరుద్యోగ యువత వయోపరిమితిని 45 సంవత్సరాలకు పెంచాలని సీపీఐ పట్టణ కార్యదర్శి, విద్యార్థి జేఏసీ కన్వీనర్ దుర్గ్యాల సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాలే ధ్యేయంగా అనేకమంది యువత తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం సాగించారని, కొంతమంది యువత తమ ప్రాణాలను సైతం కోల్పోయారన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు 45 సంవ్సతరాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది కానీ సింగరేణిలో మాత్రం కేవలం 35 సంవత్సరాలకు పరిమితమైందన్నారు. వయో పరిమితిని పెంచి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సోందే కుటుంబరావు, నాయకులు బాడిశ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

అన్నపురెడ్డిపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బూర్గూడెం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో అనుమతులు లేకుండా మట్టి, ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూమికి పచ్చాని రంగేసినట్టు..



చర్ల: మండలంలోని సత్యనారాయణపురంలో ప్రధాన రహదారి పక్కన రైతులు సాగు చేసిన జనుము పంట ఏపుగా ఎదిగి చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ప్రధాన రహదారి పక్కన ఏపుగా పెరిగి ఆ ప్రాంతమంతా పసుపుమయంగా కనిపిస్తుండడంతో భూమికి పసుపు రంగు వేసినట్టు చూపరులను ఆహ్లాదపరుస్తోంది. ఆ దారి వెంట వచ్చి పోయే వారు దాని చూసి ఆశ్చర్యానికి లోనవుతూనే ఆనందపరవశులవుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని జానకీపురం గ్రామ శివారులోని శ్రీసత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజ, అభిషేకాలు, అష్టోత్తరనామావళీ, మంత్రపుష్పం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి విచ్చేసి, బోనాలను అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఆదరణ ఉన్నా.. అభివృద్ధి సున్నా..

- వసతులకు దూరంగా సమ్మక్క సారలమ్మ దేవాలయం
- విద్యుద్దీపాలు సైతం లేని వైనం
- సౌకర్యాలు కల్పించాలని భక్తుల వేడుకోలు


ఎదిరగుట్టల్లోని సమ్మక్క సారలమ్మ దేవాలయం

చర్ల: మండలంలోని సుబ్బంపేట గ్రామపంచాయితీలో గల ఎదిరగుట్టల్లో ఉన్న సమ్మక్క సారలమ్మ దేవాలయంకు భక్తుల విశేష ఆదరణ ఉన్నా అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. మేడారం తరహాలో ప్రతీ రెండేళ్లకోసారి ఇక్కడ జాతర జరుగుతండగా దీనిని చిన్న మేడారంగా కూడా పిలుస్తుంటారు. చర్ల నుంచి వెంకటాపురానికి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిపైనే ఈ దేవాలయం ఉండగా నిత్యం ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే భక్తులు పెద్ద ఎత్తున అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రతీ ఆదివారం, మంగళవారాల్లో అమ్మవార్ల వద్దకు వెళ్తామని మొక్కుకున్న భక్తులు సైతం కుటుంబ సమేతంగా, బంధువులు, స్నేహితులతో కలిసి వచ్చి మొక్కులు చెల్లించుకుంటూ రోజంతా అమ్మవారి చెంతన గడుపుతున్నారు. ఇంతటి ప్రాధాన్యతను సంతరించుకున్న ఈ దేవాలయంపై అటు ఆలయ కమిటీ గానీ ఇటు గ్రామపంచాయతీ గానీ శ్రద్ధ చూపడం లేదు. అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఇక్కడ సరైన వసతి సౌకర్యాలు కూడా లేవు. గతంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన షెడ్లు రేకులు పగిలి, ఫ్లోరింగ్ విరిగి కూర్చోడానికి కూడా అనుకూలంగా లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా సాయంత్రం 6 గంటలు దాటిందంటే ఆ ప్రాంతమంతా చిమ్మచీకట్లతో నిండుకుంటోంది. దేవాలయంలో కనీసం విద్యుద్దీపాలు కూడా లేకపోవడంతో రాత్రి పూట ఆ ప్రాంతంలో అంధకారం రాజ్యమేలుతోంది. ఎదిరగుట్టల సమ్మక్క సారలమ్మ దేవాలయంలో నెలకొన్న తక్షణమై ఆలయ కమిటీ, గ్రామపంచాయితీ దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.